క్లుప్తంగా

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

నల్లకుంట: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని ఈరోజు దత్త సాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత దంత చికిత్సా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా.. అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్‌లలోని సాయిదత్త దంత వైద్యశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 వరకు శిబిరం ఉంటుందన్నారు. దంత సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి అన్ని రకాల దంత పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈనెల 10న అపరకర్మల పెద్దసత్రం ప్రారంభం



శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తదితరులు

కాచిగూడ: హారాస్‌పెంటలోని హిందూ శ్మశానవాటిక ప్రాంగణంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రీమోడలింగ్ చేసిన అపరకర్మల పెద్దసత్రాన్ని ఈనెల 10న ప్రారంభిస్తున్నట్లు హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు ప్రకటించారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. కాంక్రీట్ జంగిల్‌గా మారిన మహానగరంలో ఇళ్లల్లో అపరకర్మలు చేసుకోవడానికి అవసరమైన వసతులు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని అలాంటి వారికి అన్ని వసతులతో ఇక్కడే బంధుమిత్రులతో కలిసి అపరకర్మలు పూర్తి చేసుకునేలా పెద్దసత్రంలో ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రబంధక సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ విగ్, ఉపాధ్యక్షులు రాజేందర్‌పటేల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వీరస్వామి, సంయుక్త కార్యదర్శి సాయిగిరీధర్, కోశాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ పనుల పర్యవేక్షణ



పనులను పర్యవేక్షిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: నారాయణగూడ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ మార్కెట్ పనులను గురువారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. అత్యాధునిక వసతులతో ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నేతలు సురేష్, రాము, రవి, కవిత, సక్కుబాయి, భీమ్‌రాజ్, సూరి, రవియాదవ్, దినేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తాం



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీని కంచుకోటగా మార్చేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం బాగ్ అంబర్‌పేట్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అనేక మంది ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని వారికి సముచిత గౌరవం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బీజేపీ నాయకుడు క్రాంతికుమార్, సతీష్‌గౌడ్, శ్రీకర్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చంద్రమోహన్ తదితరులున్నారు.

నాలా పూడికతీత పనులపై కార్పొరేటర్ అసహనం



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: డివిజన్‌లో నాలాల పూడికతీత పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. గురువారం డివిజన్‌లో పలు నాలాల పూడికతీతపనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్నా.. పూర్తిస్థాయిలో పూడికతీత పనులు పూర్తికాకపోవడం పట్ల కార్పొరేటర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో తీయాల్సిన పూడికను నాలాలలో తీయకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పూర్తిస్థాయిలో నాలా పూడికతీత పనులను పూర్తి చేయాలని సూచించారు.

బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి



సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సంయుక్త కిసాన్‌మోర్చా డిమాండ్ చేసింది. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, మూడ్ శోభన్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కల వెంకటయ్య, ఏఐకేఎస్ సహాయ కార్యదర్శి రాంచందర్‌లు మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా పతకాలు సాధించి దేశానికి గౌరవాన్ని ప్రతిష్ఠను తెచ్చిపెడుతున్న ఒలంపిక్ పతకవిజేతలతో సహా అగ్రశ్రేణి క్రీడాకారులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మల్లయోధులను రోడ్లపై ఈడ్చుకుంటూ.. అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అన్వేష్, పీవైఎల్ కార్యదర్శి ప్రదీప్, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు డి.స్వరూప, వరలక్ష్మి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాహుల్, కిరణ్, లింగంగౌడ్, దేవమణి, పుష్ప, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడలో..

కాచిగూడ: 'దేశానికి అనేక బంగారు పతకాలను సాధించిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు'. రెజ్లర్లకు మద్దతుగా గురువారం తెలంగాణ కార్మిక ఉద్యోగ సంఘాల వేదిక అధ్వర్యంలో నారాయణగూడలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రప్రభుత్వం తక్షణమే బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషన్ శరణ్‌సింగ్‌ను పార్లమెంట్ సభ్యత్వం నుంచి అనర్హుడిగా ప్రకటించాలని విజయలక్ష్మి అన్నారు. వీఎస్‌బోస్, ఎండీ యూసుఫ్, ఎస్.బాల్‌రాజ్, నర్సింహ్మా, ప్రేమ్‌పావని, వెంకటేశం, కమలారెడ్డి, యాదగిరి, కిషన్, రమేష్, సీఐటీయూ నేతలు వంగూరి రాములు, మధు, సోమన్న, సునిత, వెంకటేష్, మోహన్ తదితరులున్నారు.

సీపీఎం మద్దతు ప్రదర్శన..

ముషీరాబాద్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. రెజ్లర్లు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా సీపీఎం నగర కమిటీ గొల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి సీపీఎం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కె. నాగలక్ష్మి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింహ్మారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహ్మారెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్, సీపీఎం నగర నాయకులు ఎం.శ్రీనివాస్‌రావు, ఎం.వెంకటేష్, కే.ఎన్.రాజన్న, నరేష్, ఎస్.మారన్న, మల్లేష్, ఆర్.వెంకటేష్, కిరణ్, అశోక్, అజయ్‌బాబు, ఆర్.వాణి, కుమారస్వామి తదితరులున్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

కాచిగూడ: రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్‌చేసి పదవి నుంచి తొలగించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా నారాయణగూడలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఐఎన్‌టీయూసీ నేతలు ఆర్‌డీ.చంద్రశేఖర్, అదిల్‌షరీఫ్, ఎం.బి.విజయ్‌కుమార్‌యాదవ్, నర్సింహ్మారావు, మల్లేష్‌గౌడ్, భరత్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్ల పంపిణీ



అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఉప్పు సుధాకర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం బాగ్‌అంబర్‌పేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తాయన్నారు.

బాటసారులకు చలివేంద్రాలు ఉపయోగకరం



మజ్జిగ పంపిణీ చేస్తున్న గోల్నాక కార్పొరేటర్ దూసరిలావణ్య శ్రీనివాస్‌గౌడ్

నల్లకుంట : వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ కోరారు. 'రిన్సీ మినిస్ట్రీ సొసైటీ' ఆధ్వర్యంలో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సిగ్నల్స్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద గురువారం బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. హాజరైన కార్పొరేటర్ బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరమైతే తప్పా.. ఇంటి నుంచి బయటకురావొద్దని సూచించారు. చలివేంద్రం నిర్వాహకులు గంధం బాలరాజు, శ్రీధర్, నరేందర్, మురారి శ్రీను, సాధిక్, మహేష్, మధు తదితరులున్నారు.

ఘనంగా దశాబ్ది వేడుకలు..

చిక్కడపల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం సాయంత్రం గాంధీనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సాధించిన 9 ఏళ్ల ప్రగతిని దశదిశలా విస్తరించేలా సంబరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తూ.. ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్తామన్నారు. ప్రత్యేక రాష్ట్ర అవతరణ అనంతరం ప్రజలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రజల సంక్షేమ, అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తున్న 53 మందిపై కేసు

కాచిగూడ: బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్న 53 మందిపై కాచిగూడ రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.53 వేల జరిమానా వసూలు చేసినట్లు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ కుమార్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. సిగరెట్లు, గుట్కాలు తదితర పొగాకు ఉత్పత్తులు సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు దోమలగూడ పీఎస్ ప్రారంభం

చిక్కడపల్లి: నూతన దోమలగూడ పోలీస్‌స్టేషన్‌ను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ, గాంధీనగర్ ఇన్‌చార్జ్ ఏసీపీ ఎ.యాదగిరి తెలిపారు. సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు లాంఛనంగా ఉదయం 8.30 గంటలకు స్టేషన్‌ను ప్రారంభిస్తారని ప్రకటించారు. చిక్కడపల్లి పీఎస్ నూతన భవనంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ వివరించారు.

పదవీ బాధ్యతల స్వీకరణ



చైర్మన్ నారాయణను సత్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి

చిక్కడపల్లి: కార్మికశాఖ రాష్ట్ర కనీసవేతనాల సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం హయంలో ఇతర రాష్ట్రాల కార్మికులు మన రాష్ట్రానికి వచ్చి పనులు చేసుకుంటున్నారన్నారు. పనుల కోసం మన కార్మికులు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం తప్పిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డి, మండలి కార్యదర్శి శ్యామ్‌సుందర్‌జాజు, కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖరం, జంటనగరాల జాయింట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

చిక్కడపల్లి: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ ఫాస్టర్స్ అసోసియేషన్ (టీయూసీపీఏ) ఆధ్వర్యంలో వివిధ జిల్లాల ఫాస్టర్లు గురువారం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫాస్టర్లు క్రిస్టియన్ ఎమ్మెల్సీగా టీయూసీపీఏ ప్రధాన కార్యదర్శి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గోనె సల్మాన్‌రాజ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ క్రైస్తవుల సంక్షేమ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే క్రైస్తవుల పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఫాస్టర్లు మెన్నో జోయెల్ జయప్రకాష్, జయకుమార్, సురేష్, సామ్‌కాల్వర్, బోనోని, యేసియా, ఎం.ఎస్.సత్యపాల్, యోహాన్ తదితరులున్నారు.

'చదువుతో పాటు ఆటలు అవసరం'



విద్యార్థులతో వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ జోనతన్ ధర్మరాజు

కాచిగూడ: వేసవి శిక్షణ శిబిరాలతో చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలుగులోకి వస్తోందని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి.జోనతన్ ధర్మరాజు పేర్కొన్నారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, లాన్ టెన్నిస్, షటిల్, బాట్మింటన్, క్రికెట్, జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్, యమగుచ్చి కరాటే, కిక్ బాక్సింగ్, వెస్ట్రన్‌డాన్స్, చెస్, డ్రాయింగ్, పెయింటింగ్‌లో నెలరోజులుగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. నారాయణగూడ వైఎంసీఏలో గురువారం నిర్వహించిన 42వ వార్షిక సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని విద్యార్థులు, క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. పాస్టర్ మైకేల్‌కోలా, వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి ప్రిస్టీ గైస్, బీ.జే.వినయ స్వరూప్, కోచ్‌లు లక్ష్మణ్, రాజశేఖర్, ఆంటోని, ఐజాక్, ఆర్.కే.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.